క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో ఐరాల విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం

ఐరాల: రాష్ట్ర స్థాయి అండర్–14 ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచినట్లు శనివారం హెచ్ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో ఎస్‌పీజీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్–14 ఫెన్సింగ్ టీమ్ ఈవెంట్ సాబర్ విభాగంలో తమ విద్యార్థి రోహిత్ బంగారు పతకం, ఈపీఈఈ ఈవెంట్‌లో యువశ్రీ కాంస్య పతకం, అలాగే మరో విద్యార్థిని భవిత వ్యక్తిగత విభాగంలో వెండి పతకం, టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. క్రీడాకారులతో పాటు ఫెన్సింగ్ కోచ్ కార్తీక్, పీడీ దేవాను పీఎంసీ చైర్మన్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన జట్లకు బహుమతిని అందజేస్తున్న రామచంద్రనాయుడు

పూతలపట్టు: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని అమరరాజా కంపెనీ డైరెక్టర్ రామచంద్రనాయుడు అన్నారు. మండలంలోని పేటమిట్ట మంగళ్ విద్యాలయంలో శనివారం రెండు రోజుల నుంచి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు బి.వి.రెడ్డి, విజయం, పీఈఎస్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఆటల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరరాజ విద్యాసంస్థల సెక్రటరీ సతీష్, ప్రిన్సిపల్ ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు

ఐరాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. ఆదివారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ పూజలు కొనసాగుతాయన్నారు. స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో నిత్యం ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, అర్చనలు, పూజలు చేపడుతున్నట్లు వివరించారు.

అంతర్జాతీయ స్థాయిలో యూసీమాస్ ప్రతిభ



బహుమతులు పొందిన చిత్తూరు యూసీమాస్ సంస్థ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో నగరంలోని యూసీమాస్ అబాకస్ సంస్థల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్‌లు భారతి, ఉమా మాట్లాడుతూ తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీన మలేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో తమ సంస్థల్లో శిక్షణ పొందిన 11 మంది విద్యార్థులు మొదటి, ద్వితీయ బహుమతులు పొందారని వెల్లడించారు. అనంతరం ఆ విద్యార్థులను వారు అభినందించారు.

మండలానికి 595 ట్యాబ్‌లు మంజూరు

బంగారుపాళెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు మంజూరైనట్లు ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదువుతున్న 299 మంది బాలురు, 296 మంది బాలికలు మొత్తం 595 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం 652 మంది విద్యార్థులకు, 115 మంది సబ్జెక్టు టీచర్లకు 767 ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు వారు వివరించారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రిని కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలిశారు. తిరుపతిలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై మాట్లాడారు. మంత్రిని కలిసిన వారిలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, నాయకులు శివ ఉన్నారు.

రైతు ఇంట సంతోషాల పంట

- అన్నదాతకు అండగా జగనన్న ప్రభుత్వం
- అందుబాటులో రైతు భరోసా కేంద్రాలు
- ముంగిట్లో విత్తనాలు, ఎరువులు

ప్రజా సంకల్పయాత్ర ద్వారా రైతుల కష్టాలు చూసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతు ఇంట సంతోషాల పంట పండించారు. విత్తు నుంచి ధాన్యం కొనుగోలు వరకు సాగులో అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. అక్కడి నుంచి వ్యవసాయానికి అవసరమైన అన్ని రకాల వస్తుసామగ్రిని అందజేస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాలు రైతు ముంగిట్లోకి వచ్చాయి. దీంతో రైతుకు వ్యవసాయం పండగలా మారింది.

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తోంది. అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. రైతుకు ప్రభుత్వ సేవలను చేరువ చేసింది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సబ్సిడీపై విత్తనాలిస్తోంది. వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు.

కేంద్రాల ఏర్పాటు

మండలంలో 8 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కుర్చివేడు, చింతలగుంట, పాలూరు, దిగువమాసాపల్లి, తాళంబేడు, తుమ్మింద, చెర్లోపల్లి, పెద్దిశెట్టిపల్లి వీటిలో తొమ్మిది కేంద్రాలు పూర్తి చేశారు. అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో నాలుగు చోట్ల ఆర్బీకేల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు.

సేవలన్నీ రైతు చెంతకే

సీజన్‌లో పంట వేసేందుకు పెట్టుబడి సాయం మొదలుకుని పంట చేతికందిన తర్వాత గిట్టుబాటు ధర అందించే వరకు ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోంది. పంట బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తోంది. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు పన్ను రద్దు చేసింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు ఉచితంగా విద్యుత్ ఇస్తోంది.

అందుబాటులోకి కియోస్క్‌లు

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ మిషన్లు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ మిషన్ ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం ముందుగానే నమోదు చేసుకోవచ్చు. తద్వారా రైతులకు ఏ మేరకు అవసరమో తెలుసుకుని తగిన నిల్వలు అందుబాటులో ఉంచుతోంది. ఇలా రైతులు ఇబ్బందిపడకుండా అన్ని రకాల సేవలు ముంగిట్లో అందిస్తోంది.



సాగవుతున్న వరిని ఈ క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

ఈ క్రాప్ నమోదు

వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టం కలిగితే రైతులను ఆదుకునేందుకు ఉచిత పంటల బీమా అమల్లోకి తెచ్చింది. రైతు భరోసా కేంద్రాలకు రైతులకు అనుసంధానకర్తలుగా పనిచేస్తున్న వ్యవసాయ ఉద్యాన సహాయకుల ద్వారా ఈ పంటల నమోదు కార్యక్రమాన్ని నిరంతరాయంగా ప్రభుత్వం చేపడుతోంది.

యాంత్రీకీకరణ

రైతులను యాంత్రీకీకరణ వైపు ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. రాయితీతో యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తోంది. ట్రాక్టర్‌తోపాటు మిగిలిన వ్యవసాయ పరికరాలు అందించడం ద్వారా గ్రూపులోని రైతులతోపాటు రైతు భరోసా కేంద్రం పరిధిలోని మొత్తం రైతులు అద్దె ప్రాతిపదికన సద్వినియోగం చేసుకోవచ్చు.







చిత్తూరు రూరల్ మండలంలోని పాలూరు రైతు భరోసా కేంద్రం, వేరుశనగ దిగుబడిని గణించే ప్రక్రియలో వ్యవసాయ అధికారులు, రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మండలంలో ఆర్బీకేల వివరాలు	
ఆర్బీకే నిర్మాణ వ్యయం	రూ.21.80 లక్షలు
రైతుల సంఖ్య	4,462 మంది
మొత్తం సాగు విస్తీర్ణం	5 వేల హెక్టార్లు
వరిసాగు విస్తీర్ణం	750 ఎకరాలు
మామిడి	2,250 హెక్టార్లు
కూరగాయల పంటలు	250 ఎకరాలు
బొప్పాయి	80 ఎకరాలు
వ్యవసాయ సహాయకులు	15

అందుబాటులో విత్తనాలు



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే పెట్టుబడి సాయం కింద నాలుగేళ్లుగా రైతు భరోసా అందుకుంటున్నాం. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నివిధాలా ఆదుకుంటున్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఇటు తమిళనాడులోని పరదారామి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలు తొలగిపోయాయి. గ్రామంలోనే కావాల్సిన విత్తనాలు, ఎరువులు లభిస్తున్నాయి. పంటలు కూడా కొనుగోలు చేస్తున్నారు.

–జయరాం, తుమ్మింద, చిత్తూరు మండలం

రైతు భరోసాతో పెట్టుబడికి ఊతం



ప్రస్తుతం వ్యవసాయం అంత సులభం కాదు. ప్రతీ దశలో పెట్టుబడి లేనిదే పని జరగదు. తొలకరి, ఖరీఫ్ నాటికి చేతిలో చిల్లిగవ్వ ఉండని పరిస్థితి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాగుకు సంబంధించిన సేవలు అందుతున్నాయి. వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుంచి ఒక పండగలా మార్చి రైతుకు అండగా నిలబడుతున్నారు.

– నాగరాజు, గొల్లపల్లి, చిత్తూరు మండలం

జగనన్నతోనే నిరంతరం సంక్షేమం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకూ సంక్షేమం, అభివృద్ధి ఆగదని, నిరంతరాయంగా కొనసాగుతుందని మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని అనుపల్లెలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మరో 90 రోజుల లోపల ఎన్నికలు రానున్నాయని, మరోసారి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేస్తేనే పథకాలు వచ్చేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించిన విషయాన్ని విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, నగర సచివాలయ కన్వీనర్ రాంగణేష్, కార్పొరేటర్ శోభ, నాయకులు శిరీష్, హేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నే సీఎం

తవణంపల్లె: పేదలకు సంక్షేమ పథకాలు అందించిన జగనన్న మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని మల్లకుంట సచివాలయంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల డిజిటల్ బోర్డును అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు, గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి, సర్పంచ్ రంజిత్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, గాంధీబాబు, రమణారెడ్డి, రవిరెడ్డి, కిషోర్‌రెడ్డి, వంశీరెడ్డి, స్వరూప్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, రాజారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధురెడ్డి, ఈఓపీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



మల్లకుంటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ గీతా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం కార్యక్రమాలు, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ప్రతి పేద కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నారని చెప్పారు. దీంతో పేదలంతా మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ముందుగా మండల అధికారులు శాఖల వారీగా జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు అమలుతీరును వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు జయరాం, రంజనీ, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరునికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన దాత బాలాజీ శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు నగదు అందించారు. దాత, కుటుంబీకులకు స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. పసల కుమారస్వామి హేమంత్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పడికెట్ల పూజ

గుడిపాల: అడవిచేను గ్రామంలో శనివారం రాత్రి అయ్యప్పభక్తులు పడికెట్ల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం వద్ద 18 పడికెటు ఏర్పాటు చేసి, అయ్యప్పస్వామి చిత్రపటాలను ఉంచి దీపారాధన చేసి వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి కీర్తనలు పాడారు. భజనలు చేస్తూ స్వామివారిని ప్రార్థించారు. అడవిచేను గ్రామానికి చెందిన 26 మంది అయ్యప్పస్వామి భక్తులు పడికెట్ల పూజ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలను ఎంఈఓ రుక్మిణీ, ప్రసాద్ తనిఖీ చేశారు. పాఠశాలను వారు శనివారం ఉదయం సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, పరిసరాలు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచిగా ఉందని కొనియాడారు. పాఠశాల హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై కళాజాత



మాట్లాడుతున్న ఈఈ పద్మనాభపిళ్లై

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించేందుకు నగరంలో శనివారం కళాజాతను ప్రదర్శించారు. నిత్య జీవితంలో వనరుల వినియోగంపై పొదుపు అవసరమని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లైఅన్నారు. అవసరాన్ని బట్టి విద్యుత్ వాడుకోవాలన్నారు. అవసరం లేని సమయంలో టీవీ, ఫ్యాన్, ఏసీలను వినియోగించరాదన్నారు. ఎక్కువగా నీళ్ల మోటార్, గీజర్, ఐరన్‌బాక్స్‌ల స్విచ్‌లు ఆఫ్ చేయడం మరిచిపోతామన్నారు. నేటి పొదుపు భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి, ఏఈ మహమ్మద్, ఉద్యోగులు యజ్ఞేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు అయోధ్య రాముడి అక్షింతలు



అయోధ్యరామ అక్షింతలను అన్ని గ్రామాలకు తీసుకెళ్తున్న భక్తులు

గుడిపాల: అయోధ్య రామ మందిర అక్షింతలను మండలంలోని గ్రామాలకు చేరవేశారు. అయోధ్య శ్రీరామచంద్రుల వారిని పూజించిన పవిత్ర అక్షింతలను గ్రామ గ్రామాన ప్రతి ఒక్క హిందువు కుటుంబానికి చేరవేయాలన్న లక్ష్యంతో మండలంలోని 27 పంచాయతీలకు చేరవేశారు. విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు వేలు, మల్లికార్జున, శివ మాట్లాడుతూ అయోధ్య శ్రీరాముల వారి అనుగ్రహం పొంది అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. మండల ఇన్‌చార్జ్ లోకేష్ ఆధ్వర్యంలో వసంతాపురంలోని వినాయకస్వామి దేవాలయం వద్ద 27 పంచాయతీలకు అయోధ్యరామ మందిర అక్షింతలను అందజేశారు. వీటిని జనవరి 1 నుంచి 5వ తేదీలోగా ప్రతి హిందువు కుటుంబానికి చేరవేయాలన్నారు. జనవరి 22వ తేదీ అయోధ్య రామ మందిరం ప్రారంభం తరువాత ప్రతి ఒక్కరూ వారి పూజ గదిలో అక్షింతలను చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో 27 పంచాయతీల గ్రామ పెద్దలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటివద్దకే వైద్యం

ఐరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందుతోందని వైద్యులు తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. రాత్రిపూట దోమతెరలు తప్పనిసరిగా వాడాలని చెప్పారు. జ్వర పీడితులు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెద్దిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. మండలంలోని పెద్దిశెట్టిపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది తేజ, ఇందుమతి, నిరోష, నరసమ్మ, చంద్ర పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈచనేరిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సూచనలు, సలహాలిచ్చి మందులు అందజేశారు. గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ గంగ, యమున, ఆశావర్కర్లు పాల్గొన్నారు.








ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, తవణంపల్లె: ఈచనేరిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్, గుడిపాల: రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

ప్రతి విద్యార్థికీ శాస్త్ర పరిజ్ఞానం అవసరం



వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి

తవణంపల్లె: ప్రతి విద్యార్థి శాస్త్ర పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. తవణంపల్లె హైస్కూల్లో శనివారం పాఠశాల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ పరికరాలను ప్రదర్శించగా ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, హెచ్ఎం శ్రీరంజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలను త్వరలో నిర్వహిస్తామని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.